# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 25-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాజస్థాన్ లో లక్షా 22 వేల కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు శంకుస్థాపనలు చేశారు.
- ❖ పరిశుభ్రతను జీవన విధానంగా మార్చుకోవాలని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ దేశ పౌరులకు సూచించారు.
- ❖ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి భవిష్యత్ లో బ్యాంకులు మరింత ముఖ్యమైన పాత్ర పోషించాల్సి ఉంటుందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 126వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

====================

ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారతదేశ వృద్ధి మాత్రం అద్భుతంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ లోని గ్రేటర్ నోయిడాలో ఈరోజు జరిగిన అంతర్జాతీయ ట్రేడ్ ఎగ్జిబిషన్ ను ప్రధానమంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... ఎటువంటి అవాంతరాలు కూడా దేశ దృష్టిని మరల్చలేవని, సంక్షోభ పరిస్థితులలో సైతం భారత్ కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటుందన్నారు. నేడు భారతదేశం రాబోయే దశాబ్దాలకు పునాదిని బలోపేతం చేస్తోందని చెప్పారు. గత దశాబ్దకాలంలో ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియాపై దృష్టి సారించిందని ప్రధానమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

ఇక ఉత్తరప్రదేశ్ పర్యటన ముగించుకొని సాయంత్రం రాజస్థాన్ చేరుకున్న ప్రధానమంత్రి బన్స్ వారాలో లక్షా 22 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు.

====================

పరిశుభ్రతను జీవన విధానంగా మార్చుకోవాలని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ దేశ పౌరులకు సూచించారు. `స్వచ్ఛతా హీ సేవా` కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు న్యూఢిల్లీలోని ఆర్మీ ప్రధాన కార్యాలయంలో సత్కరించారు. 'స్వచ్ఛ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని దేశంలోని ప్రతి ఒక్కరూ ఒక ఉద్యమంలా స్వీకరించడం పట్ల ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ విప్లవంలో భాగంగానే నేడు దేశం స్వచ్ఛతా దివాస్‌ను జరుపుకుంటోందని పేర్కొన్నారు.

(వాయిస్ 23 సెకన్లు)

===================

వినూత్న విధానాలతో ఆర్థిక వృద్ధికి బ్యాంకులు దోహదపడాలని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు. ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, రాబోయే కాలంలో బ్యాంకులు మరింత ముఖ్యమైన పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 91వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పూణేలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వినియోగదారులను దృష్టిలో ఉంచుకొని బ్యాంకింగ్ పథకాలను తీసుకురావాలని ఆర్థిక మంత్రి ఈ సందర్భంగా సూచించారు.

===================

వాయుసేన కోసం 62 వేల 370 కోట్ల రూపాయలతో 97 తేజస్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసేందుకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (HAL)తో రక్షణ శాఖ ఈరోజు ఒక ఒప్పందం చేసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇప్పటికే దీనికి ఆమోదం తెలిపింది. మిగ్-21 యుద్ధవిమానాల స్థానంలో ఈ సింగిల్ ఇంజిన్ ఎంకే-1ఏ తేజస్ జెట్స్ ను వాయుసేన ప్రవేశపెట్టనుంది. తాజాగా సమీకరిస్తున్న 97 విమానాల్లో.. 68 యుద్ధ విమానాలు, 29 ట్విన్ సీటర్స్ ఉండనున్నాయని రక్షణ శాఖ వెల్లడించింది.

===================

జాతీయ జియోసైన్స్ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు ప్రధానం చేయనున్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో 2024 సంవత్సరానికి గానూ ప్రతిష్ఠాత్మక జాతీయ జియోసైన్స్ అవార్డులను రాష్ట్రపతి ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి జి. కిషన్ రెడ్డి, బొగ్గు-గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే హాజరవుతారు.

===================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా స్వావలంబన దిశగా పయనిస్తున్న భారత రక్షణ రంగంపై ఒక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 105 సెకన్లు)

===================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్

కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

====================

తిరుమలలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ రెడీ అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీల సహాయంతో ఈ అధునాతన కమాండ్ కంట్రోల్ సెంటర్ పని చేయనుంది. ఇది 6 వేల సీసీ కెమెరాల సహాయంతో 3డి మ్యాపింగ్, రెడ్ స్పాట్లను గుర్తించి రద్దీ నిర్వహణకు అవసరమైన సూచనలను చేస్తుంది. టీటీడీ నిర్వహణలోని అన్ని దేవాలయాలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ తో అనుసంధానించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

====================

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తెలంగాణా, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. ఇక మహారాష్ట్ర గోవా, కొంకణ్ ప్రాంతాలలో 27వ తేదీన భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

====================

వెస్టిండీస్‌తో స్వదేశంలో ఆడే టెస్ట్ క్రికెట్ సిరీస్ కోసం బీసీసీఐ ఈరోజు భారత జట్టుని ప్రకటించింది. అక్టోబర్ 2 నుంచి 14 వరకు రెండు టెస్టుల సిరీస్ జరగనుంది. శుభ్ మన్ గిల్ కెప్టెన్ గా రవీంద్ర జడేజాను వైస్ కెప్టెన్ గా నియమిస్తూ 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టుని ప్రకటించింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్ లో భాగంగా ఈ సిరీస్ జరగనుంది. ఇప్పటికే ఇంగ్లాండ్ తో జరిగిన సిరీస్ ను భారత్ డ్రా చేసుకుంది. ఇక మరోవైపు భారత జట్టు యూఏఈలో ఆసియా కప్ ఆడుతోంది. ఇప్పటికే ఫైనల్స్ లో చోటు దక్కించుకున్న భారత్ ఈరోజు బంగ్లాదేశ్, పాకిస్తాన్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ లో విజయం సాధించిన జట్టుతో ఫైనల్ ఆడుతుంది.

====================
====================